ప్రజాశక్తి
బుధవారం 20 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి



జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహించిన బీటెక్ మూడవ సంవత్సరం ఫలితాలు విడుదల అయ్యాయి. ఒకటవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15), (ఆర్19) సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం), బీటెక్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం) ఇచ్చిన పరీక్షా ఫలితాలు, ఎం.ఫార్మసీ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ మూడవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ ఒకటవ సంవత్సరం (ఆర్17), ఫార్మాడీ రెండవ సంవత్సరం (ఆర్17), ఫార్మాడీ మూడవ సంవత్సరం (ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ (పిబి) ఒకటవ సంవత్సరం (ఆర్17), ఫార్మాడీ (పిబి) రెండవ సంవత్సరం (ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.



మల్లు స్వరాజ్యంకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

పోరాట స్ఫూర్తి మల్లు స్వరాజ్యం

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భావి తరాలకు పోరాట స్ఫూర్తిగా మల్లు స్వరాజ్యం నిలుస్తారని సిపిఎం నాయకులు తెలియజేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం నాడు నిర్వహించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. రజాకారులకు వ్యతిరేకంగా పనిచేశారన్నారు. ఎమ్మెల్యేగా, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలుగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆమె మరణించేంత వరకు సిపిఎం ఎర్రజెండా నీడన ఉండి ప్రజా పోరాటం నిర్వహించారన్నారు. నేటి తరానికి ఆమె పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జడా సుబ్బిరెడ్డి, ఈఎస్.వెంకటేష్, పెద్దన్న, నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, పెనుకొండ రమేష్, పెడబల్లి బాబా, రామక్రిష్ణప్ప, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు

అర్ధరాత్రి విషాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న అంబులెన్స్
- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు
- మరణించిన వ్యక్తిని తీసుకుని వస్తుండగా ప్రమాదం



ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన అంబులెన్స్ ముందు భాగం

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో మరణించిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఇంటికి తీసుకుని వస్తుండగా అది ప్రమాదానికి గురై మరో ఇద్దరు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాధాన్ని నింపింది.

వార్త మెయిన్‌లో

ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

సబ్ రిజిస్టర్ వద్ద రూ. 2.50 లక్షలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

ప్రజాశక్తి మడకశిర, రొళ్ల

ఏసీబీ అధికారుల వలలో అవినీతి తిమింగం చిక్కుకుంది. శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర సబ్ రిజిస్టర్ కార్యాలయంపై మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన 8.32 ఎకరాల స్థలం రిజిస్టర్ చేయడానికి బేరం కుదుర్చుకొని అతని వద్ద నుండి రూ. 2,50లక్షలు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్టర్ దామోదర్ రెడ్డి, రైటర్ గా పనిచేస్తున్న షమీవుల్లా పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు వారిద్దరని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో అనంతపురం, కర్నూల్ జిల్లా ఏసీబీ అధికారులు ఈ దాడులు నిర్వహించారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో ఏసీబీ అధికారులు

'ఓపెన్' పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి కదిరి టౌన్

పదవ తరగతి ఓపెన్ పరీక్ష కేంద్రాన్ని డిఇఒ మీనాక్షి మంగళవారం తనిఖీ చేశారు. ఓపన్‌పరీక్షల్లో అంతా మాస్ కాపీయింగ్ కథనం మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డిఇఒ మంగళవారం పట్టణంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ బాలుర కళాశాల నందు పరీక్షా కేంద్రంలో తనిఖీ చేయగా విద్యార్థి ఆంగ్ల మాధ్యమం (ఇంగ్లీష్) పరీక్ష బదులు తెలుగుకు సంబంధించిన సమాధాన పత్రాలు తీసుకొచ్చినట్లు ఆమె గుర్తించారు. ఈసందర్భంగా డీఈవో మీనాక్షి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెగ్యులర్ పది పరీక్షలతో పాటు దూరవిద్య ద్వారా ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. రెగ్యులర్ ఓపెన్ పరీక్షలకు సంబంధించి 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామని చెప్పారు. పరీక్షల్లో ఎవరైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల విద్యాధికారి చెన్నకృష్ణ, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని అల్లుగుండు గ్రామానికి చెందిన యుగంధర్ యాదవ్(29) వడదెబ్బతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన యుగంధర్ యాదవ్ సోమవారం పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన యుగంధర్ అస్వస్థతకు గురయ్యారు. అర్ధరాత్రి సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ యుగంధర్ యాదవ్ మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ప్రస్తుతం మూడునెల గర్భిణి. యుగంధర్ యాదవ్ కదిరి పట్టణంలో సూపర్ మార్ట్ నడుపుతూ జీవనం సాగించేవాడని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




యుగంధర్ యాదవ్ (ఫైల్‌ఫొటో)

ప్రచారంలో నిమగ్నం..!



- అభ్యర్థులు ప్రకటించిన చోట జనం వద్దకు నేతలు
- అన్ని స్థానాలకూ వైసిపి ప్రకటన
- ఇంకా రెండు స్థానాలు తేల్చని టిడిపి
- ఎన్నికల పనుల్లో అధికారులు బిజీబిజీ



జిల్లాలో ఎన్నికల హడావుడి ఊపందుకుంటోంది. ఇంతకాలం నోటిఫికేషన్ కోసం ఎదురు చూసిన నాయకులకు అది రావడంతో ఇక తదుపరి కార్యక్రమాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ప్రచారంపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రకటించిన చోట ప్రచారం వేగం పెరిగింది. అధికార వైసిపి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించేసింది. టిడిపి రెండు స్థానాలు మినహా మిగతా వాటికి అభ్యర్థులను ప్రకటించి వారిని ప్రచారం చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఈసారి బరిలో ప్రధాన పార్టీల నుంచి హేమాహేమీలు పోటీలో నిలుస్తున్నారు. అన్ని శాసన సభ స్థానాల్లోనే సువ్వానేనా అన్నట్లు పోటీ ఉంది. ఈ పోటీ నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమిగ్నం అయ్యారు. ఇప్పటికే అధికార పార్టీ గత నెలలో సిద్ధం పేరుతో రాప్తాడు వద్ద భారీ బహింగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరై వైసిపి శ్రేణులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేసి వెళ్లారు. ఎన్నికల సంగ్రామం మొదలైందని గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పని చేయాలని చెప్పి వెళ్లారు. ఆ తరువాత ఆ పార్టీ అభ్యర్థుల ప్రకటన జరిగింది. అభ్యర్థుల ప్రకటన రావాడంతో అందరూ ప్రచారంలో మునిగిపోయారు. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని అస్త్రశస్త్రాలతో ప్రచారాలను చేస్తోంది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పెనుకొండ రా..కదిరిరా పేరుతో బహిరంగ సభను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల టిడిపి నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సభ నుంచే ఆయన వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులకు సూచించి వెళ్లారు. గత వారంలో నాలుగు రోజుల పాటు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పేరుతో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. అభ్యర్థులు ఖరారైన స్థానాల్లో ఆయన పర్యటించి నేతలకు దిశానిర్దేశం చేశారు. గత నెలలో నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి కూడా పలు నియోజకవర్గాల్లో పర్యటించి టిడిపి శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసి వెళ్లారు.

ఆ రెండింటిపై టిడిపిలో వీడని సస్పెన్స్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టిడిపి ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక మూడు స్థానాలు మిగిలి ఉన్నాయి. వీటిలో ధర్మవరం నియోజకవర్గానికి బిజెపికి కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. మిగిలిన అనంతపురం, గుంతకల్లు స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ఇది కూడా మరో రెండు మూడు రోజుల్లో ఫైనల్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అధికారులు బిజీబిజీ

ఎన్నికల నగరా మోగడంతో అధికారులు బిజీబిజీ అయ్యారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. కలెక్టర్, ఇతర ఎన్నికల అధికారులు అందరూ కూడా పూర్తి స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పరిశీలన చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ హాల్, ఈవీఎంలను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఎన్నికల సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి వారికి తగిన మార్గదర్శకాలు ఇస్తున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నారు. మొత్తం మీద అభ్యర్థులు ప్రచారం పనుల్లో నిమగ్నం అయ్యి ఉండగా, అధికారులు ఎన్నికల నిర్వహణ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

షరతులు లేకుండా పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు కట్టించుకోవాలి ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బిసి వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బాబావలి ఏఐఎస్ఎఫ్, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హిందూపురంలోనిడిగ్రీ కళాశాలలో కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులకు పరీక్ష ఫీజులను కట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్.కె యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలకు 2వ సెమిస్టర్,4వ సెమిస్టర్, 6వ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 20వ తేదీ వరకు పరీక్ష ఫీజును కట్టించుకోవడానికి చివరి తేదీగా ప్రకటించారన్నారు. చివరి తేది ముగిస్తే జరిమానతో పరీక్ష ఫీజును చెల్లించాల్సుందన్నారు. డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థి జగనన్న విద్యా దీవెన ఆధారంగానే చదువును కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమేమో సరైన సమయానికి విద్యా దీవెన ను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొందన్నారు.కళాశాల యాజమాన్యాలు మాత్రం విద్య దీవెనకు సంబంధం లేకుండా మా కళాశాల ఫీజు కడితేనే పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని చెబుతున్నాయని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైనా అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి పరీక్ష ఫీజు కట్టించుకోవాలన్నారు. పరీక్ష ఫీజును కట్టించుకొని యాజమాన్యాల పైన ఎస్‌కె యూనివర్సిటీ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు రాజు, బాబా ఫక్రుద్దీన్, దేవరాజు, వేణు, రంగ, హరీష్, బాలాజీ, దర్శన్, పవన్, రంగప్ప, నరసింహ, సాయిరాం పాల్గొన్నారు.

'టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు '

ప్రజాశక్తి -బుక్కపట్నం

భవిష్యత్తు బాగుండాలంటే తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, పల్లె వెంకట కష్ణ కిషోర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నార్సింపల్లి, నార్సింపల్లి తండా గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు పల్లె సింధూర రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితారాల భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతామల్లిరెడ్డితో పాటు మాజీ సర్పంచ్ సాకే యశోద, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, నాయకులు గంగాధర్, బాలాజీ, మనోహర్, మాజీ సర్పంచి చెన్నకేశవులు, శ్రీనివాస్ రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న పల్లె సింధూర

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పర్చుతున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో ఎన్నికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాలలో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు అనుమతించరాదని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నూతన అనుమతులను ఏమాత్రం ఇవ్వవద్దని సూచించారు. బోర్డర్ చెక్‌పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరచాలన్నారు. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంనుఉపయోగించడం, సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం తదితర అంశాలను సమీక్షించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, మడకశిర గౌరీ శంకర్, కదిరి వంశీకృష్ణ, ధర్మవరం వెంకట సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతిష్టంగా అమలు చేస్తున్నామని ఇప్పటికే పిఒలు, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ విభాగం : డిఆర్ఒ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ల విభాగం ఏర్పాటు చేసినట్లు డిఆర్ఒ కొండయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో జిల్లాలోని ఓటర్లు ఏ సమస్య తలెత్తిన టోల్ ఫ్రీ విభాగానికి ఫోన్ చేస్తే సత్వరం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ టోల్ ఫ్రీ సదుపాయాన్ని ఓటర్లు ఫ్రీగా వినియోగించుకోవాలని కోరారు. ఫోన్ చేయవలసిన నెంబర్లు 18004258795, 18004258796, 18004258797 అని ప్రకటనలో తెలిపారు.

నేడు శ్రీవారి కళ్యాణోత్సవం

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహోత్సవాలు మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. కెఎస్ నాగేశ్వరరావు ఉభయ దారులుగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆగమం శాస్త్ర ప్రకారం నిర్వహించారు. 20వ తేదీ బుధవారంఏకాదశి రోజున ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం మహోత్సవానికి ఆలయంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నామ రామచంద్రయ్య శెట్టికుటుంబ సభ్యులు ఉభయదారులుగా హాజరవుతారన్నారు. కళ్యాణోత్సవానికి హాజరవుతున్న భక్తులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వామి వారికి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఈవో తెలిపారు. డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవానికి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య తెలిపారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దాం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికలను అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిద్దామనిర్డీవో భాగ్యరేఖ, పుట్టపర్తి డిఎస్‌పి వాసుదేవన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవోకార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు, వీడియో వివింగ్ టీం, విఎస్‌టి, ఫ్లేయింగ్ స్క్వాడ్ అకౌంట్ టీం ,అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ టీం శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో అన్ని టీములు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నిర్వహించాలన్నారు. సత్య సాయి జిల్లాలోని ఇతర రాష్ట్రాల సరిహద్దులలో ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని వాటి ద్వారా ముమ్మర తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆమడగూరు మండలంలో రెండు, ఓడిసి మండలంలో ఒకచెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు తాసిల్దార్లుచ ఎంపీడీవోలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 97.8 శాతం హాజరు

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన పదవ తరగతి హిందీ పరీక్షకు 97.8 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో మీనాక్షి తెలిపారు జిల్లావ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలలో 22,420 మంది విద్యార్థులకు గాను 21,809 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కొత్త చెరువులోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ తనిఖీ చేశారు.

గాండ్లపెంట : పదవ తరగతి పరీక్షకేంద్రాలను డిఇఒ పరిశీలించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల కేజీపీ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని డీఈవో మీనాక్షి పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షకేంద్రాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరీక్షల పర్యవేక్షకులు శ్రీధర్ రెడ్డి, బషీర్, గౌస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎవరైతేనేం అదరం... బెదరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎవరైతేనేం తాము అదరం.. బెదరం అన్న చందాన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బరితెగించి ప్రైవేట్ కోఆర్డినేటర్లతో కుమ్మకై తానూ కోఆర్డినేటర్‌గా మాస్‌కాపీయింగ్‌కు సహకరించడం విమర్శలకు తావిస్తోంది.ఉపాధ్యాయ వృత్తిని అడ్డుపెట్టుకొని యథేచ్ఛగా పరీక్ష కేంద్రంలోకి వెళ్తూ విద్యార్థులు మాస్ కాఫియుంగ్ పాల్పడేందుకు శాయ శక్తులా కృషి చేస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి. కదిరి పట్టణంలో రెండవ రోజు ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్, (దూరవిద్య పరీక్షలు) జరుగుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి డిఇఒ మీనాక్షి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి వెళ్ళారు. ఆమె వెళ్ళిన అనంతరం ప్రయివేటు కోఆర్డినేటర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయుల ముసుగులో ఉన్న కోఆర్డినేటర్లు మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహించారు. ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష ఫీజు రూ. 2వేల లోపు అయితే కొంతమంది కోఆర్డినేటర్లు విద్యార్థుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని రూ. 15 వేల నుండి 20 వేల రూపాయల వరకు వసూలు చేస్తు, ఫీజుల దందా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక ఫీజులు చెల్లిస్తే మిమ్మల్ని ఎవరు ఇబ్బంది పెట్టారని పరీక్షా కేంద్రాలలో మావారే ఇన్విజిలేటర్లుగా ఉంటారని పుస్తకాల పెట్టి దర్జాగా రాసుకోవచ్చని నమ్మబలికి అధికమొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయలు వసూలు చేస్తు ప్రభుత్వాన్ని,విద్యార్థులను మోసం చేస్తున్న కోఆర్డినేటర్ల, దళారులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్లి వస్తున్న ప్రయివేటు కోఆర్డినేటర్

కోడ్ కూసినా.. నిద్ర వీడని అధికార యంత్రాంగం



పెన్నా పరివాహకంలోని ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూసింది. అధికారులకు సర్వహక్కులు ఉన్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులందరినీ అధికారులు ఒకేలా చూడాల్సి ఉన్నప్పటికీ హిందూపురంలో మాత్రం అధికార పార్టీ నేతలకు అధికారులు సలాం కొడుతున్నారు. దీనికి నిదర్శనం గత కొంత కాలంగా హిందూపురం పట్టణ సమీపంలోని పెన్నా నదిలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి పట్టా పగలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ అటు పోలీసు, ఇటు సెబ్, రెవిన్యూ అధికారులు ఏ ఒక్కరు కూడా వీరిపై చర్యలు తీసుకోకపోవడమే.

పెన్నాలో ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు

జిల్లా అధికారులు పర్యటిస్తున్నా పట్టించుకోరేం..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న పెన్నా నది పరివాహక ప్రాంతంలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ పేరుతో బిల్లులు సృష్టించి అధికార పార్టీకి చెందిన హిందూపురం రూరల్ మండలం జెడ్‌పిటిసి సోదరుడి కుమారుడు, సోదరులు, అధికార పార్టీకి చెందిన మరి కొంతమంది కలిసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టుకొని పెన్నా నదిలో ఇసుకను తోడేస్తున్నారు. పగలు పట్టణం, రాత్రి సమయాల్లో కర్నాటకకు తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో ఇసుక తోడుతున్న వారితో అనుమతులు ఉన్నాయా అని అడిగితే విజయవాడకు చెందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వారు అందించిన బిల్లును చూపిస్తున్నారు. అయితే ఆ బిల్లు రూ 2500 చెల్లించినట్లు ఉంది.ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పెన్నా నది నుంచి ఇసుకను తరలించడానికి అనుమతులు ఇచ్చినట్లు ఉంది. ఇది ఒక లోడ్‌కు ఇచ్చారా.? ఒకరోజు మొత్తానికి ఇచ్చారా.? అన్నది అర్థం కావడం లేదు. ఇసుక రీచ్ నిబంధనల మేరకు బిల్లు ఇస్తే దూరాన్ని బట్టి సమయం వేసి ప్రతి లోడ్ కు బిల్లు ఇస్తారు. అలా కాకుండా రోజు మొత్తానికి ఒకే బిల్లుతో ఇసుక రవాణా జరుగుతోంది. ఇసుకను నింపుతున్న వారిని బిల్లు ఎక్కడ ఇస్తారు అంటే సరైన సమాధానం చెప్పలేదు. అయితే వీరి వెనుక ముఖ్య నేత సోదరుడు ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణా అధికార పార్టీ నేతలు కనుసనల్లో జరుగుతుండడంతో అధికారులు చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై హిందూపురం తహశీల్దార్‌ను వివరణ అడగగా తమకు ఏమీ తెలియదని, ఇసుక రీచ్ లకు సంబంధించి కార్యాలయం నుంచి ఎటువంటి ప్రత్యుత్తరాలు జరపలేదని అన్నారు. ఈ విషయంపై మూడు రోజుల నుంచి సెబ్ అధికారులకు వివరణ కోసం ప్రయత్నించగా స్థానిక సెబ్ సిఐ అందుబాటులోకి రాలేదు. ఇక పోలీసులు అయితే అడపాదడపా ఒకటి రెండు ట్రాక్టర్లను ఎప్పుడో ఒకసారి పట్టుకుంటున్నారు. అలా పట్టుకుని ఇలా వదిలి వేస్తున్నారన్నా విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా అధికారులు పర్యటిస్తున్న పట్టించుకోవటం లేదు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హిందూపురం నియోజకవర్గానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ను ఎన్నికల అధికారిగా నియమించారు. ఆయన నిత్యం హిందూపురంలో పర్యటిస్తున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణాపై ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ నేతలకు ఐదు సంవత్సరాల నుంచి సలాంలు కొడుతున్న అధికారులు ఎన్నికల కోడ్ కూసినప్పటికీ ఇప్పుడు కూడా అధికార పార్టీ నేతల కనుసన్నులోనే విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారి ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సత్యసాయి విద్యార్థుల గ్రామసేవ

పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయి విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తున్న 2024 సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు గ్రామ సేవ నిర్వహించారు. మంగళవారం రూరల్ మండలపరిధిలోని అమగొండ పాల్యం, రాజప్ప గారి పల్లి, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కరానటక నాగేపల్లి వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో గ్రామ సేవ నిర్వహించారు. ఈ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకుని సత్యసాయి విద్యాసంస్థల నుంచి వేరే పట్టణాలకు వెళుతున్న సందర్భంలో వారు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్వయంగా తయారు చేసిన పులిహోర, చక్కెర పొంగలి, ప్రసాదాలు ప్రతి ఇంటికి వెళ్లి అందజేశారు. అడవి ప్రాంతమైన అమగొండపాలెం లో గ్రామ సేవలో పాల్గొనడం తమకెంతో మధురానుభూతినిచ్చిందని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

పుట్టపర్తి అర్బన్ : కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు మంగళవారం ఎన్నికల కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో మే నెల 13వ తేదీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ నెల 15వ తేదీ లోగా 18 ఏళ్లు నిండిన యువత ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకొని వారు ఉంటే ఓటు నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండిన తర్వాత తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి సంబంధిత ఎన్నికల అధికారుల ద్వారా ఓటు కొత్తగా నమోదు చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకొని ఓటు హక్కు పొందాలని కోరారు.

బాధిత కుటుంబానికి 'పల్లె' భరోసా

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి పట్టణంలో పెద్ద బజారుకు చెందిన చాకలి వెంకటేష్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం రాత్రి గుండెపోటుతో వెంకటేష్ మృతి చెందాడని తెలుసుకున్న పల్లె మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే అభివృద్ధి

ఓబుళదేవర చెరువు : ఎన్నికల ప్రచారం భాగంగా మండల పరిధిలోని టి.కుంట్లపల్లి, తానాకొత్తపల్లి, పెద్దసానివారిపల్లి, తాటిమేకలపల్లి, బాసప్పగారిపల్లి, చెర్లోపల్లి గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్లకృష్ణారెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, షామీర్ భాషా, తుమ్మల బాబా, జోలి బాబా, చంద్రమౌళి నాయుడు, లక్ష్మీ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కిందనే భోజనాలు

సోమందేపల్లి : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 700 లో స్థానిక పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడంతో సుమారు ఐదు రోజుల నుంచి ఇంటి స్థలాలు కావాలంటూ పేద ప్రజలు సమీప చెట్ల కిందనే వంటావార్పు చేసి భోజనాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి నీడ లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని బాధితులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, ఓబులేసు, అంకన్న గంగమ్మ, సుజాత, రెడ్డమ్మ గంగరాజు తదితరులతో పాటు నిరుపేదలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

రొద్దం : రొద్దం గ్రామానికి చెందిన ఈడిగ భీమయ్య(70) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి, సుబ్బరత్నమ్మ తదితరులు మృతదేహాన్ని సందర్శించని నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నపయ్య, రొద్దం నరసింహులు, నరహరి, అశ్వర్థనారాయణ, హరీష్, పుల్లప్ప చౌదరి, సురేష్, పవన్ కుమార్, నాగరాజు, వెంకటప్ప, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

మడకశిర : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ కుంచితి ఒక్కలిగ రాష్ట్ర డైరెక్టర్ మల్లిన మడుగు నారాయణప్ప అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామపంచాయతీలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రత్నమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఎంజారప్ప, రమేష్, నరసింహప్ప ఈరన్న, మాజీ వైస్ ప్రెసిడెంట్ మీనాక్షి సిద్దయ్య గౌడ్, పాల్గొన్నారు

ఇంటింటి ప్రచారం

ముదిగుబ్బ : మండలంలోని గుంజేపల్లిలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంగళవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. వైసిపికి అండగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి, చిన్న బాలముని, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే సమన్యాయం




ఆత్మీయ సమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్

ఆత్మీయ సమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

వైసిపితోనే సమన్యాయం సాధ్యమని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మండల పరిధిలోగల గుమ్మాయగారిపల్లి రంగ మహల్‌లో దళితులతో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు వైసీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అంతకు ముందు అంబేద్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ,అనంతరం మంత్రి మాట్లాడుతు దళిత కుటుంబానికి చెందిన పిల్లలు ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియం చదువుకోవటానికి కారణం జగనన్నేనని అన్నారు. చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నా ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చే సరికి అమలు కాని హామీలిస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రమీల మూర్తి, సర్పంచికాటేపల్లి గంగప్ప,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఈశ్వర్, సోమందేపల్లి నాయకులు నరసింహమూర్తి, కంబాలప్ప, నరసింహమూర్తి, కళ్యాణ్ దుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ కిష్టప్ప, గోరంట్ల మండల అధ్యక్షులు రమేష్ బాబు,వానవోలు నారాయణ, ఓబుళకుమార్, ఫ్యాన్ నరసింహులు, వెంకటేష్, దళిత సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

ప్రజాశక్తి - కదిరిటౌన్

వైసిపి నుండి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మంగళవారం కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో ఎన్‌పి.కుంట మండలం దనియానిచెరువు పంచాయతీ గోవిందరాజు పల్లికి చెందిన 20 కుటుంబాలు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. రెడ్డప్ప రెడ్డి, చిన్న రెడ్డప్ప రెడ్డి, రాము, నడిపి రెడ్డప్ప రెడ్డి, సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, శీన, శివయ్య, సూరి, రమణప్ప నాయుడు, రాజారెడ్డి, కె.రెడ్డప్ప రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, శ్రీ హరి నాయుడు తదితరులకు కందికుంట టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాల్మీకి స్కూల్ అధినేత పివి.పవన్ కుమార్ రెడ్డి, కెపి.అంజినప్ప నాయుడు, అక్కులప్ప, కుమార్ నాయుడు, కొండయ్య, హనుమంతు రెడ్డి, రాం మోహన్ నాయుడు, రెడ్డప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన, వైద్యశిబిరం

మడకశిర : మండలం పరిధిలోని అమిదాలగొంది గ్రామ పంచాయతీ పరిధిలో వేంకటేశ్వర వృద్ధాశ్రమంలో డిఎచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం అర్ హనుమంతు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరంలో దాదాపు 175 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా అందులో 25 మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారన్నారు. వారిని కిమ్స్ సావెరా హాపత్రి లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లను చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కె ఎం ఉమర్ పారుఖ ఖాన్, అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ పి అయుబ్ అలీ ఖాన్ లెజండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పి రంజాన్, బి సి సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, వాల్మీకిసంక్షేమసంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గంపల గంగరాజు,లెజండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ సభ్యులు కార్పెంటర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఓబుళదేవర చెరువు : బండలు అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బండలు మీద పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని వశిష్ట పాఠశాల సమీపంలో మార్బల్ బండలు లారీలో నుంచి అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బండలు నల్లమాడకు చెందిన హరి, నాగరాజు, నంద్యాల చెందిన సల్మాన్‌పై పడ్డాయి. దీంతో ముగ్గురికి కాలు విరిగి తీవ్రత రక్త గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన హరి, నాగరాజుకు ప్రైవేట్ వాహనంలో వైద్య చికిత్స నిమిత్తం పుట్టపర్తికి తరలించారు. సల్మాన్‌ను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి...

రొళ్ల : మండల సమీపంలో గల జాతీయ రహదారి మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. మాధుడి గ్రామానికి చెందిన సురేష్ రొళ్ల పట్టణంలో ఫ్రూట్ జ్యూస్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.ఈ క్రమంలో మారుతి కారులో స్వగ్రామం నుంచి రొళ్లకు వస్తు జాతీయ రహదారిని దాటు తుండగా అదే సమయంలో అగళి వైపు నుంచి మడకశిర వైపు వెళుతున్న అమరాపురం పట్టణానికి చెందిన వేణు కారులో అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో సురేష్ నడుపుతున్న కారు ఎగిరి గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో సురేష్, వేణుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను రొళ్ల సిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. తర్వాత 108 సాయంతో మెరుగైన వైద్య కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పుట్టపర్తి రూరల్: నియోజకవర్గ పరిధిలోని పలు కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ంండల పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన కిషోర్ నాయక్ అనారోగ్య కారణంగా మృతి చెందడంతో వారి ఇంటివద్దకు వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవలే అనారోగ్య కారణంగా మరణించిన లక్ష్మన్న కుటుంబాన్ని పరామర్శించి, అన్నివిధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు, రామాంజనేయులు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బికెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న రొద్దం నాయకులు

పార్థసారధి మద్దతుదారుల సంబరాలు

ప్రజాశక్తి గోరంట్ల

బికె పార్థసారధికి హిందూపురం పార్లమెంటు టిడిపి అభ్యర్థిగా ప్రకటించడంతో మండలంలోని బికే పార్థసారధి వర్గీయులు నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పార్థసారధికి హిందూపురం పార్లమెంటు టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు హిందూపురం పార్లమెంటులో పార్థసారధిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, కొత్తపల్లి నరసింహులు, శ్రీనివాసులు, వేణు, జయరాం, మరి రెడ్డి, నరసింహులు, దాసయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : హిందూపురం తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా బికె. పార్థసారథిని అధిష్టానం నిర్ణయించడంతో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పెనుకొండలో పార్థసారథి స్వగృహంలో రొద్దం మండల టిడిపి కన్వీనర్ నరహరి, పెనుకొండ టిడిపి పట్టణ కన్వీనర్ రవి శంకర్, తెలుగు యువత నాయకులు నరేంద్ర చౌదరి, ఉపేంద్ర చౌదరీ, తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పుల్లప్ప చౌదరీ తదితరులు వెళ్లి శుభాకాంక్షలు తెలపారు.

సోమందేపల్లి : తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పార్థసారధికి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ కేటాయించడంతో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం నాయకులు కత్తి మారుతి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మూర్తి, బుల్లెట్ మల్లికార్జున, మధు, హరిప్రసాద్, గంగాధర్, సోము తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వచ్చే ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించాలన్న లక్ష్యంతో కేంద్రసాయుధబలగాలతో కలిసి ధర్మవరం పట్టణంలో కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం



సిద్ధు కుటుంబ సభ్యులకు చెక్ అందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు సిద్దు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని పాంజన్య శ్రీనివాసులు అన్నారు. ఇటీవల మృతిచెందిన సిద్దు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. పాఠశాల తరపున రూ.10వేలు, ప్రవేటు పాఠశాలల అసోసియోషన్ తరపున రూ.20వేలు చెక్కును బాధితులకు అందించారు. అదే విధంగా సిద్దు కుమార్తె తమ పాఠశాలలో యూకేజి చదువుతోందని ఆమె తమ పాఠశాలలో ఎంత వరకు చదివితే అంతవరకు ఉచితంగా విద్యను అందిస్తామన్నారు. దీంతో పాటు మరో ఇద్దరు కుమార్తెల విద్యకు అవసరమైన సహాయ సహకరాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రీయాజ్, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. అదే విధంగా పరిగి దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వేణుగోపాలరావు సిద్దు కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో పిల్లల చదువు కొరకు తన వంతు సాయం అందజేస్తానని భరోసా కల్పించారు. డెంటిస్టు మోహన్ బాబు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. అందరు మానవత్వంతో ముందుకు వచ్చి జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవడంపై హిందూపురం ప్రెస్ క్లబ్ తరపున జర్నలిస్టులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మడకశిర

మాజీ జెడ్పీటీసీ, ప్రముఖ యాదవ సంఘం నాయకుడు రామకృష్ణ యాదవ్ టిడిపిలోకి చేరాడు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి నాయకులు వక్కలిగ సంఘం రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామయ్య, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వర్థనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, వైస్ చైర్మన్ పరమేష్, రైతు సంఘం అధ్యక్షులు రాజగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య చౌదరి, మాజీ కౌన్సిలర్లు డిష్ రమేష్, గోపాల్, నాగిరెడ్డి, సీనియర్ నాయకులు గణపతి టిడిపల్లి మంజు, నరేష్, చీపులిటీ నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, క్రిష్ణప్ప, అక్కమపల్లి రంగనాథ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రామన్న, రాజూ, కో ఆప్షన్ మాజీ సభ్యుడు అల్లిఖాన్, అంజయ్య, సురేష్, ప్రవీణ్, భూతారాజు, మంజునాథ్, జనసేన నాయకుడు హరీష్ కరియన్న పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరిన వారితో ఆపార్టీ నాయకులు

బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

మండల పరిధిలోగల కమ్మలమండ్లపల్లి వద్ద గల బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లో ఉన్న సైంటిఫిక్ ఎరెవ్నా ఐటీ-సంబంధిత సైంటిఫిక్ సర్వీసెస్ సంస్థ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. బిఎస్‌సి అగ్రికల్చర్ నుండి ఎంపిక చేసిన పదిహేను మంది విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆఫర్‌లను జారీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ఎస్ బిలిగి విజయవంతమైన ఇంటర్వ్యూలు, ఎంపికపై విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ఛాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్, చైర్మన్ భరత్ లాల్ మీనా అభినందించారు.

వైసిపిదే విజయం : ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

కదిరి టౌన్ : వచ్చే ఎన్నికల్లో వైసీపీ దే విజయమని ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ కార్యాలయానికి ఆయన మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో పాటు నాయకులకు ఉండవలసిన విలువలను చూపించిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. గతంలో నరేంద్ర మోడీని టెర్రరిస్ట్‌గా అభివర్ణించిన చంద్రబాబు నాయుడు నేడు ప్రపంచానికి గురువు అని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, పూల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎండీ ఇస్మాయిల్, పరికి సాధిక్ భాష, సాదత్ అలీ ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.